సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



రంగనాథునికి వెండి కవచం

సఖినేటిపల్లి: అంతర్వేది ఉపాలయంలో కొలువైన రంగనాథునికి అలవర్తి పవన్‌కుమార్ దంపతులు (తెనాలి) 6.195 కిలోల వెండి కవచాన్ని సమర్పించారు.




ఆదిపూజ్యునికి లక్ష కలార్చన

చదువుల పండుగ పేరుతో అయినవిల్లి విఘ్నేశ్వర ఆలయంలో సోమవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీయాగం నిర్వహించారు.

8 లో

డెల్టాలకు 8 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.20 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్స్

- 15 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- డీఐఈవో సోమశేఖరరావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఐఈవో సోమశేఖరరావు

అమలాపురం టౌన్: ఈ నెల ఐదో తేదీ నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఐఈవో వనుము సోమశేఖరరావు వెల్లడించారు. అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ పరీక్షలపై సిబ్బందికి సోమవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ మూడు స్పెల్స్‌గా ఈ ప్రాక్టికల్స్ జరుగుతాయని తెలిపారు. మొదటి స్పెల్ ఐదో తేదీ నుంచి జిల్లాలో జరుగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణ కోసం చీఫ్ సూపరింటెండెంట్స్, ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్స్‌ను నియమించినట్టు తెలిపారు. పరీక్ష పేపర్ డౌన్ లోడ్ చేయడం, వాల్యుయేషన్, మార్కుల నమోదు, ఆన్సస్ స్క్రిప్ట్ ప్యాకింగ్ మొదలైన అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రథమ సంవత్సర పరీక్షలు 2,408 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలు 2,646 మంది రాయనున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల కమిటీ సభ్యులు వై.లక్ష్మణరావు, ఎం.రామారావు, కె.శ్రీనివాస్, బి.సింహాద్రిరావు, అమలాపురం ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు అడబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా అంతటా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం జరిగిన 'పర్యావరణ విద్య' పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఐఈవో సోమశేఖరరావు తెలిపారు.

శుభస్య శీఘ్రం..



ఆలయ పశ్చిమ రాజగోపురాన్ని తీర్చి దిద్దుతున్న కార్మికులు

- లక్ష్మీ నృసింహుని కల్యాణోత్సవానికి అంతర్వేది మహా పుణ్యక్షేత్రం సిద్ధం
- నేటి నుంచి కార్యక్రమాల ప్రారంభం
- రథసప్తమి వేడుకలతో శ్రీకారం

సఖినేటిపల్లి: భక్తుల కోరికలను తీర్చే శ్రీకరుడు, సర్వ శుభాలనిచ్చే శుభకరుడు లక్ష్మీనృసింహుడు. ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా ఉన్న అంతర్వేది మహా పుణ్యక్షేత్రంలో లక్ష్మీ నరసింహస్వామి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. అంతర్వేది స్వయంభూ లక్ష్మీ నృసింహుని దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు మంగళవారం రథసప్తమి నుంచి ప్రారంభం కానున్నాయి. పురాణ ప్రసిద్ధితో పాటు, చారిత్రక ప్రాధాన్యం సంతరించుకున్న ఈ మహా పుణ్యక్షేత్రంలో 13వ తేదీ వరకూ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉత్సవాలకు క్షేత్రం ముస్తాబు

అంతర్వేది క్షేత్రం మంగళవారం నుంచి మొదలయ్యే లక్ష్మీ నరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు ముస్తాబవుతోంది. పశ్చిమ రాజగోపురంతో పాటు ఇతర గోపురాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయం లోపల క్యూలైనులో భక్తులు వేడి నుంచి ఉపశమనం పొందేలా షామియానాతో అలంకరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో భక్తులను ఆకట్టుకునే రీతిలో దేవతామూర్తులు, ఇతర భారీ కటౌట్‌లు సిద్ధం చేస్తున్నారు.

నేడు రథసప్తమి

ప్రత్యక్ష నారాయణుడైన సూర్య భగవానుడు సర్వజగత్తుకు వెలుగును ప్రసాదించిన రోజు ఇది. ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యగమనం దక్షిణ దిశ నుంచి ఉత్తర దిశకు మారడం రథసప్తమి నుంచే ఆరంభమవుతుంది. ఈ రోజున ఆదిత్యుని సేవిస్తే రోగ, శోక, పాపఫలాలు నశిస్తాయన్నది భక్తుల నమ్మకం. ఈ రోజున అర్చకులు రథానికి పూజ చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. ప్రాంగణంలో ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు, అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేసి నివాళులర్పించడం ఇక్కడి ఆనవాయితీ.

సూర్య, చంద్ర ప్రభవాహనంపై ఊరేగింపు

సూర్య భగవానుడి పుట్టిన రోజు రథసప్తమి నాడు ప్రారంభమయ్యే వేడుకల్లో తొలి రోజు మాడవీధుల్లో సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. స్వామివారికి ఉన్న వాహనాల్లో మొదటి రోజున పై రెండు వాహనాల్లో గ్రామోత్సవాలు నిర్వహిస్తారు.

సిద్ధమవుతున్న లడ్డూ ప్రసాదం

లక్ష్మీనృసింహుని తీర్థమహోత్సవాలకు వచ్చే భక్తులకు లడ్డూ ప్రసాదాన్ని దేవస్థానం సోమవారం సిద్ధం చేస్తోంది. 80 గ్రాముల బరువున్న లడ్డూ రూ.15గా నిర్ణయించారు. ప్రాథమికంగా సుమారు రెండు లక్షల వరకూ లడ్డూలు సిద్ధం చేయిస్తున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

అపూర్వ ఘట్టం ముద్రికాలంకరణ

రథసప్తమి రోజున ఆది దేవుడిని వరునిగా చేయడం, అమ్మవారిని వధువుగా చేయడం అపూర్వ ఘట్టం. తరతరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం కేశవదాసుపాలేనికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబ సభ్యులు సంయుక్తంగా స్వామి, అమ్మవార్లకు ముద్రికాలంకరణ నిర్వహిస్తారు. బుగ్గన చుక్క పెట్టి స్వామి, అమ్మవార్లను వధూవరులుగా తీర్చిదిద్ది ముద్రికాలంకరణ చేస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లు అర్చకుల విశేష పూజలు అందుకుంటారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పిస్తారు.

ఉత్సవాల షెడ్యూల్

మంగళవారం నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించనున్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల షెడ్యూల్ ఇలా..

- 4వ తేదీ రథసప్తమి. సూర్య, చంద్రప్రభ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించడం (ముద్రికాలంకరణ).
- 5వ తేదీ గరుడ పుష్పక, పుష్పక వాహనాలపై గ్రామోత్సవాలు.
- 6వ తేదీ హంస, శేష వాహనాలపై గ్రామోత్సవాలు. సాయంత్రం ధ్వజారోహణ.
- 7వ తేదీ పంచముఖ ఆంజనేయ, కంచుగరుడ వాహనాలపై గ్రామోత్సవాలు. దశమి రాత్రి 12–55 గంటలకు మృగశిర నక్షత్రయుక్త వృశ్చిక లగ్నంలో స్వామివారి తిరు కల్యాణం.
- 8వ తేదీ భీష్మ ఏకాదశి పర్వదినాన మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం.
- 9వ తేదీన గజ, పొన్న వాహనాలపై గ్రామోత్సవాలు. రాత్రి అన్నపర్వత మహా నివేదన.
- 10న హనుమద్ వాహనం, సింహ వాహనాలపై గ్రామోత్సవాలు. సాయంత్రం సదస్యం.
- 11న రాజాధిరాజ, అశ్వ వాహనాలపై గ్రామోత్సవాలు. 16 స్తంభాల మండపం వద్ద చోర సంవాదం.
- 12న పౌర్ణమి. చక్రవారీ సముద్ర స్నానం. గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం. అవభృథోత్సవం. రాత్రి ధ్వజారోహణ.
- 13న పుష్పక వాహనంపై గ్రామోత్సవం. రాత్రి హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం. అనంతరం శ్రీపుష్పోత్సవం.



ఆలయం లోపల క్యూలైనుపై చేసిన డెకరేషన్



ఆలయ ప్రాంగణంలో భక్తులను ఆకట్టుకునేలా భారీ సెట్టింగ్

శతశాతం లక్ష్యంగా ప్రణాళిక

- వదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం
- డీఈఓ సలీం బాషా



సాక్షి, అమలాపురం: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయడానికి పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రత్యేక విద్యా ప్రేరణ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం, సాయంత్రం, సెలవు దినాల్లో అదనపు తరగతులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపా ధ్యాయులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. పరీక్షల నిర్వహణ ఎస్‌సీఈఆర్‌టీ అందించిన మూడు మోడల్ పేపర్లను ప్రతి విద్యార్థి పూర్తిగా అభ్యసించేలా చర్యలు తీసు తీసుకుంటున్నామని డీఈఓ తెలిపారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఏడు దశల్లో పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. 8వ దశలో ఎస్‌సీఈఆర్‌టీ మొదటి మోడల్ పేపర్, ఆపై ప్రీ-ఫైనల్, అనంతరం మిగిలిన రెండు మోడల్ పేపర్లు నిర్వహిస్తామన్నారు. మొత్తం నాలుగు గ్రాండ్ టెస్టులు నిర్వహించి విద్యార్థులను పూర్తిగా సన్నద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

ఫిబ్రవరి రెండో వారంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసి, జిల్లా అంతటా హైస్కూళ్లను సందర్శించనుందన్నారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించి, తక్కువ సమయంలో తీసుకోవాల్సిన చర్యలను సూచించనుందన్నారు.

మట్టి మేతలో వర్గపోరు



పెదకందాలపాలెం ర్యాంపులో జేసీబీని స్వాధీనం చేసుకున్న అధికారులు

పి.గన్నవరం: కూటమి ప్రభుత్వ పాలనలో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. అధికారులంటే అసలు భయమే లేదు. మండలంలో ఇసుక, మట్టిని దొరికినంత దోచుకుంటున్నారు. తాజాగా మండలంలోని పెదకందాలపాలెం ర్యాంపు వద్ద మానేపల్లి పరిధిలోని లంక భూముల నుంచి ప్రభుత్వ అవసరాల పేరుతో పెద్ద ఎత్తున మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు జరిపేందుకు రెండు వర్గాల వారు రంగం సిద్ధం చేస్తున్నారు. కాగా ఈ తవ్వకాలకు ఎవరికీ అనుమతులు లేవు. అయినప్పటికీ వారిలో ఒక వర్గం ఇప్పటికే బాటలు ఏర్పాటు చేసినా పట్టించుకోకుండా, కొత్తగా బాటలు వేస్తున్న రెండో వర్గం వారి జేసీబీని అధికారులు స్వాధీనం చేసుకోవడంతో సోమవారం వివాదం తలెత్తింది. అధికారులు తీసుకువెళ్తున్న జేసీబీని నిర్వాహకులు దారిలో నిలిపేసి తాళాలు పట్టుకుని వెళ్లిపోవడంతో సిబ్బంది ఏమీ చేయలేకపోయారు. పెదకందాలపాలేనికి సమీపంలోని లంకల్లోకి ఇప్పటికే ఒక వర్గం వారు నిబంధనలకు విరుద్ధంగా నదీపాయలో తూరలు ఏర్పాటు చేసి బాటలు నిర్మించారు. వారికి సంబంధించిన జేసీబీ ఇంకా ర్యాంపులోనే ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రెండో వర్గం వారు ర్యాంపులో బాట ఏర్పాటు చేస్తుండగా తహసీల్దార్ పి.శ్రీపల్లవి ఆదేశాలతో సోమవారం రెవెన్యూ అధికారులు పోలీస్ అధికారులు అక్కడి చేరుకుని జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న నిర్వాహకులు అక్కడికి వచ్చి తమ జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ పనుల కోసం మట్టిని తవ్వేందుకు తాము దరఖాస్తు చేశామని, సమీపంలోని ర్యాంపులో మరొక వర్గం జేసీబీ ఉండగా, తమది మాత్రమే ఎందుకు తీసుకువెళ్తున్నారని అధికారులను నిలదీసి వెళ్లిపోయారు. దీంతో అధికారులు అక్కడ వీఆర్వోను, పోలీస్ కానిస్టేబుల్‌ను కాపలా ఉంచి వారు కూడా వెళ్లిపోయారు. ఇరు వర్గాలపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే మొదటి వర్గానికి నియోజకవర్గ నేత మద్దతు ఉందని, రెండో వర్గానికి ఓ మంత్రి మద్దతు ఉందని ఎవరికి వారు చెప్పుకోవడం గమనార్హం.

ఈ-పంటతో ఈ-కేవైసీ చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



కోడూరుపాడులో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అల్లవరం: జిల్లాలో వరి పండించే ప్రతి రైతు తమ పంటకు సంబంధించి ఈ-పంట నమోదుతో పాటు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు సూచించారు. మండలం కోడూరుపాడులో జరుగుతున్న ఈ-పంట ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ-పంట నమోదు వల్ల రైతులకు పంట నష్ట పరిహారం, పంటల బీమా, వడ్డీ లేని రుణాలు, ధాన్యం కొనుగోలు మొదలైన పథకాల అమలవుతాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1,46,157 ఎకరాల్లో వరి నాట్లు ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తయిందన్నారు. అలాగే 57,334 ఎకరాల్లో వరి పంట ఈకేవైసీ పూర్తి అయిందని తెలిపారు. ఈ-పంట నమోదును ఈనెల 10 వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు. అల్లవరం మండలంలో ఇప్పటి దాకా 3619 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని చెప్పారు. అలాగే మండలంలో 3200 ఎకారాల్లో ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తి అయిందని చెప్పారు. కార్యక్రమంలో సహాయ మండల వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ, వ్యవసాయ విస్తరణాధికారి ఎం.శుభ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛను రోజు బంగారమ్మ.. ఆనక గుదిబండమ్మ!



బస్టాండ్‌లో బంగారమ్మతో మాట్లాడుతున్న స్థానికులు, సచివాలయ ఉద్యోగి

అమలాపురం రూరల్: ఆమె సొమ్ము కావాలి కానీ.. ఆమె ఆలనా పాలనా పట్టించుకోని ఓ మతి స్థిమితం లేని వృద్ధురాలి దీన పరిస్థితి ఇది. కొత్తపేట మండలం మందపల్లి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి బంగారమ్మకు మతి స్థిమితం లేదు. ఈ కారణంతో ఏడాది క్రితం ఆమె కుటుంబం స్థానిక బస్టాండ్ ఎదురుగా అమానుషంగా వదలి వెళ్లిపోయారు. ఆమెపై వారికి నెలనెలా మాత్రమే ప్రేమ పుట్టుకొస్తుంది. ఆ ప్రేమ కూడా ఆమెపై కాదు. ఆమెకు వచ్చే పెన్షన్‌పైనే. ప్రతినెలా ఒకటో తేదీన బంధువులలో ఎవరో ఒకరు వచ్చి ఆమె ద్వారా పింఛను సొమ్ము తీసుకుని మళ్లీ అదే బస్టాండ్‌లో వదిలేసి వెళ్లిపోవడం ఇలా సాగిపోతోంది. అలా వదలి వెళ్లిన రోజు నుంచి ఆ బంగారమ్మకు స్థానిక వ్యాపారులు, ఆటో కార్మికులే ఆత్మ బంధువులై ఆలనా పాలనా చూస్తున్నారు. పలు సందర్భాల్లో ఆ పింఛను సొమ్ముకోసం వచ్చిన వారిని స్థానికులు నిలదీయగా ఆమెకు మతి స్థిమితం లేదని, ఇంటికి తీసుకువెళ్లినా ఉండదని, ఎక్కడికో అక్కడికి వెళ్లిపోతుందని చెప్పేవారు. తాజాగా సోమవారం ఆమె సోదరి గ్రామ సచివాలయం సిబ్బందిని తీసుకుని వచ్చి పింఛను తీసుకునే ప్రయత్నం చేసింది. దీనిని గమనించిన స్థానిక ఆటో కార్మికులు, పండ్ల వ్యాపారులు బంగారమ్మ సోదరిని అడ్డుకుని పింఛను సొమ్మును ఆమె నుంచి తీసుకుని బంగారమ్మకు తాము ఖర్చు చేస్తామని పేర్కొన్నారు. దీంతో బంగారమ్మ సోదరి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

ఈఓ గారూ.. ఈసీ కోడ్ ఉందండీ..



దేవస్థానం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మంత్రి సుభాష్ చిత్రం

రామచంద్రపురం రూరల్: ఎలక్షన్ కమిషన్ (ఈసీ)ని లెక్క చేయని ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని వైఖరిపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అయినప్పటికీ ఈ నెల 8వ తేదీన జరుగనున్న ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణ వేడుకల ఆహ్వానం కోసం వేయించిన ఫ్లెక్సీలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఫొటో ప్రింట్ చేయించడమే కాకుండా ఆలయ ప్రాంగణంలోని సప్తగోదావరి వద్ద ప్రజల సందర్శనకు ప్రధాన రహదారిపై పెట్టడంపై తీవ్రంగా చర్చనీయాంశమవుతోంది. గత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండపేటలో ఒక పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దేవస్థానం అన్నదానం కంప్యూటర్ ఆపరేటర్ దొడ్డా మణిదీప్‌ను అప్పట్లో ఎన్నికల అధికారులు విధుల నుంచి తప్పించినప్పటికీ ప్రస్తుత ఈఓ అతడిని తిరిగి విధుల్లోకి తీసుకోవడంపై సైతం చర్చనీయాంశమైంది.

పచ్చ గూండాల రచ్చ

- తుని మున్సిపల్ కార్యాలయంలో టీడీపీ కార్యకర్తల బరితెగింపు
- వైస్ చైర్మన్ ఎన్నిక అడ్డగింపు
- కౌన్సిలర్ల సీట్లలో కూర్చుని గలాటా
- మహిళా కౌన్సిలర్లను గంటపాటు అడ్డుకున్న పోలీసులు
- ప్రేక్షక పాత్రకు పరిమితమైన అధికారులు



గలాటాయే మా విధానం: కౌన్సిల్ హాలులో కమిషనర్, చైర్మన్ పోడియం వద్ద టీడీపీ నాయకుల నినాదాలు



నో పర్మిషన్: మున్సిపల్ కార్యాలయం గేటు మూసివేసి, చైర్‌పర్సన్ సుధారాణిని, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను అడ్డుకుంటున్న పోలీసులు

తుని: మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికపై కూటమి నాయకులు సోమవారం చేసిన రచ్చ అర్ధ శతాబ్దపు తుని మున్సిపాలిటీ చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోయింది. సాధారణంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక అధికార, ప్రతిపక్షాలకు చెందిన కౌన్సిలర్ల సంఖ్యా బలం ఆధారంగా జరుగుతుంది. కానీ, టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రాతినిధ్యం వహించిన తునిలో దీనికి భిన్నంగా జరగడం అందరినీ నిర్ఘాంతపరిచింది. ప్రజాస్వామిక విలువలను కాలరాసిన ఈ ఘటన వివరాలివీ..

చైర్‌పర్సన్, కౌన్సిలర్లను అడ్డుకున్న పోలీసులు

గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ, మండల పరిషత్‌లకు రెండో వైస్ చైర్మన్ పదవికి జీవో విడుదల చేశారు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తుని మున్సిపాలిటీలో రెండో వైస్ చైర్మన్ పదవి పామర్తి మహేష్‌కు దక్కింది. రెండేళ్ల పదవీ కాలం ముగియడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ చైర్మన్ పదవి భర్తీకి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి రెండు రోజుల ముందే సోమవారం ఉదయం 10 గంటలకు కార్యాలయానికి రావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణికి, కౌన్సిలర్లకు కమిషనర్ వెంకట్రావు సర్కులర్ పంపారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీకి చెందిన 24 మంది కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే గేటు వద్ద భారీగా మోహరించిన పోలీసులు 11 గంటల వరకూ చైర్‌పర్సన్‌ను, కౌన్సిలర్లను లోపలకు రాకుండా అడ్డుకున్నారు. ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్, పోలీసు అధికారులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ప్రిసైడింగ్ అధికారి రాలేదని చెప్పి కాలయాపన చేశారు. అదే సమయంలో 'పచ్చ' నేతలు అసలైన ప్లాన్ అమలు చేశారు. టీడీపీకి చెందిన నాయకులు, కొంతమంది రౌడీషీటర్లు గేటు వద్దకు చేరుకుని వైఎస్సార్ సీపీ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమయం 11 గంటలవుతున్నా లోపలకు ఎందుకు పంపించడం లేదని కమిషనర్‌ను, పోలీసులను చైర్‌పర్సన్ సుధారాణి ప్రశ్నించారు. అంతలో అక్కడకు మీడియా చేరుకోవడంతో అధికారులు వెనక్కు తగ్గారు.

నేడు వైస్ చైర్మన్ ఎన్నిక

తుని మున్సిపాలిటీ జరుగుతున్న అరాచకాన్ని మీడియాలో ఎండగట్టడంతో ఉన్నతాధికారులు స్పందించారు. వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం నియమించిన ప్రిసైడింగ్ అధికారి పి.వేణుగోపాలరావు మంగళవారం ఎన్నిక నిర్వహిస్తున్నట్టు నోటీసు జారీ చేశారు. సోమవారం ఎపిసోడ్‌లో వేణుగోపాలరావు మున్సిపల్ కార్యాలయానికి రాకుండా తహసీల్దార్ కార్యాలయంలోనే ఉండిపోవడం కొసమెరుపు.

కౌన్సిల్ హాలులోకి టీడీపీ కార్యకర్తలు

నిబంధనల ప్రకారం కౌన్సిల్ హాలులోకి కౌన్సిలర్లు, అధికారులకు తప్ప మరెవ్వరినీ అనుమతించకూడదు. తుని మున్సిపాలిటీలో టీడీపీకి ఒక్క కౌన్సిలర్ కూడా లేరు. అందువలన మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఆ పార్టీ నుంచి నామినేషన్ వేసే అవకాశం లేదు. అయినప్పటికీ, అధికారులు, పోలీసులు తొలుత టీడీపీ కార్యకర్తలను కౌన్సిల్ హాలులోకి పంపించారు. అనంతరం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను అనుమతించారు. ఇదే అదనుగా టీటీపీకి చెందిన వ్యక్తులు కౌన్సిల్ సమావేశ మందిరంలోకి దూసుకుపోయారు. దీంతో, కౌన్సిలర్లు మెట్ల మార్గంలోనే నిలిచిపోయారు. పోలీసులు అక్కడకు చేరుకుని కౌన్సిలర్లను సమావేశ మందిరంలోకి తీసుకువెళ్లారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ టీడీపీ కార్యకర్తలు కౌన్సిల్ హాలులో అరాచకం సృష్టించారు. కౌన్సిలర్ల కుర్చీల్లో కూర్చుని అలజడి సృష్టించారు. టీడీపీ వ్యూహంలో భాగంగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను రెచ్చగొట్టి, గొడవ పెట్టుకుని వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా వేయించాలని ప్రణాళిక వేశారు. అయితే, గొడవలు సృష్టించేందుకు అధికార టీడీపీ చేసిన కుట్రను గుర్తించిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఎంతకూ స్పందించలేదు. చివరకు వారు కౌన్సిల్ హాలు నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇంత జరుగుతున్నా కమిషనర్ మౌనం వహించడం ఆశ్చర్యపరచింది. ఈ ఎపిసోడ్‌లో మున్సిపల్ అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమైన తీరు సర్వత్రా విస్మయానికి గురి చేసింది.

ముద్రగడ ఇంటిపై దాడి హేయం

కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



రావులపాలెం: కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడి హేయమైన చర్యని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ముద్రగడ ఇంటిపై జరిగిన దాడి వెనుక పక్కా కుట్ర దాగి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా పెద్దలను గౌరవించడం మన ధర్మమని, గోదావరి జిల్లాల్లో అందరూ గౌరవించే ముద్రగడపై ఎన్నడూ లేని విధంగా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. అధికార పార్టీ బలం చూసుకునే కొందరు ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని, ఇది మంచి సాంప్రదాయం కాదని జగ్గిరెడ్డి అన్నారు. ముద్రగడ పద్మనాభంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

నాడే నయమని పింఛెన్!

- పేదింట పెద్దన్నగా జగన్ పాలన
- ఒకే నిష్పత్తిలో పెన్షనర్లు, పెన్షన్ల పెంపు
- దివ్యాంగులపై ఎంతో కనికరం
- కూటమి పాలనలో ఎంతో వ్యత్యాసం
- అనర్హులంటూ వేలాది పెన్షనర్ల తొలగింపు
- సర్వే పేరుతో క్షోభ పెడుతున్న సర్కారు
- వలంటీర్ వ్యవస్థ లేక లబ్ధిదారుల ఇక్కట్లు

కపిలేశ్వరపురం: శరీరంలో సత్తువలేదు.. జీవనాధార మనుకునే స్థిరాస్తులు లేవు.. కటుంబ సభ్యుల్లో ఎవరి బతుకు వారిది... ఇలాంటప్పుడు దేవుడే దిక్కు అనుకోవడం సహజం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వమే అన్నింటికి ఆధారం. ప్రభువు పేదల పక్షపాతి అయితే ఆ అభాగ్యుల జీవితాల్లో నిత్యం వెలుగులు నిండుతాయి. కాకుంటే కాళరాత్రులు రాజ్యమేలుతాయి. 2019–24లో వైఎస్ జగన్ పాలనాకాలంలో డాక్టర్ వైఎస్సార్ పింఛను కానుక నిరుపేదలకు తోడై నిలిచింది. లబ్ధిదారుని ఇంటికే సొమ్ము అందజేసే వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటింటా ఓ కుటుంబ సభ్యుడై నిలిచారు జగన్. ఈ పథకానికి ఐదేళ్లు నిండిన సందర్భంగా ఈ కథనం..

పింఛను పథకం నేపథ్యం ఇదీ..

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనకు ముందు రోజుల్లో అరకొరగా పింఛను ఇచ్చేవారు. లబ్ధిదారులు ఎవరైనా చనిపోతేనే కాని మరొకరికి పింఛను మంజూరయ్యేది కాదని ఆరోజుల్లో చెప్పుకునేవారు. వైఎస్సార్ సీఎం అయ్యాక అర్హులందరికీ పింఛను మంజూరు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పెద్ద సంఖ్యలో పింఛన్లు మంజూరు చేశారు. 2020 జూన్ 1 నుంచే పెంచిన మొత్తంతో పింఛన్లు అందజేశారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి 2020 ఫిబ్రవరి 1 నుంచి వృద్ధుల ఇంటి వద్దే పింఛను సొమ్ము ఇవ్వడం ప్రారంభించారు.

తొలి సంతకంతో ఉమ్మడి జిల్లాలో మేలు ఇలా...

2019 జూలై 1 నుంచి పెంచిన రూ.2,250 చొప్పున అందజేశారు. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 5,81,827 మందికి రూ.15 కోట్ల మేర అదనపు లబ్ధి చేకూరింది. తర్వాత కాలంలో పింఛను లబ్ధిదారుల సంఖ్యనూ, అందజేసే సొమ్మునూ పెంచారు. వృద్ధాప్య పింఛన్లు 2,40,737, వితంతు 2,25,297, దివ్యాంగ 67,250, చేనేత 11,038, ఒంటరి మహిళ 10,341, అభయ హస్తం 9,541, మత్స్యకార 7,987, చర్మకార 1,671, డప్పు కార్మిక 1,415, కిడ్నీ బాధిత పింఛనర్లు 493 మందికి లబ్ధితో జగనన్న కాలంలో పింఛన్ల పంపిణీ రోజును పండగా భావించేవారు.

ప్రస్తుత ఫిబ్రవరిలో లబ్ధిదారులిలా...

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,37,244 కాకినాడ జిల్లాలో 2,72,437, తూర్పు గోదావరి జిల్లాలో 2,36,331 మందికి వివిధ విభాగాల్లో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

కూటమి పాలనలో కుదింపు

జగన్ పాలనా కాలంలో పింఛను సాయం సొమ్ముతో పాటు లబ్ధిదారుల సంఖ్యనూ పెంచుతూ వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లాలో 2019–20లో 2,05,556 మంది పింఛన్లు తీసుకునేవారు. అది కాస్తా 2020–21లో 2,20,666 మందికి, 2021–22లో 2,25,508 మందికి, 2022–23లో 2,35,248 మందికి, 2023–24 డిసెంబర్ నాటికి 2,44,840 మందికి పెరుగుతూ వచ్చారు. 2019 జూలైలో రూ.వెయ్యి నుంచి రూ.2,250కి పెంచి పంపిణీ చేశారు. 2022 జనవరి నుంచి రూ.2,500, 2023 జనవరి నుంచి రూ.2,750, 2024 జనవరి నుంచి రూ.3 వేలు చొప్పున వైఎస్ జగన్ ప్రభుత్వం అందించింది. కూటమి పాలనలో కాకినాడ జిల్లాలో జూలైలో 2,629, ఆగస్టులో 2,873, సెప్టెంబర్‌లో 2,732, అక్టోబర్‌లో 3,877, నవంబర్‌లో 2,869 పింఛన్లు తగ్గించడం కూటమి అబద్ధాల పాలనకు అద్దంపట్టింది.



వైఎస్ జగన్ పాలనలో పడమర ఖండ్రికలో దివ్యాంగురాలి ఇంటివద్ద పింఛను ఇస్తున్న వలంటీర్ (ఫైల్)

అడుగడుగునా వంచన

2014 ఎన్నికల సమయంలో 650 హామీలను ఇచ్చి రాష్ట్ర ప్రజలను టీడీపీ ప్రభుత్వం మోసం చేసిందన్న వాదన ఉండేది. గెలిచిన తర్వాత టీడీపీ వెబ్‌సైట్‌లో మేనిఫెస్టోను సైతం తొలగించి బాధ్యతలను విస్మరించింది. 2019 ఎన్నికల ప్రచారంలో వైఎస్ జగన్ ప్రకటించిన మేనిఫెస్టోను కాపీ కొడుతూ తానూ రూ.2 వేలకు పింఛను పెంచుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. తర్వాత పేదల మేలుకోరి వైఎస్ జగన్ క్రమంగా పింఛను సొమ్మును రూ.3 వేలకు పెంచుతానని హామీ ఇచ్చి అమలు చేశారు. 2024 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఎలాగైనా గెలవాలన్న కాంక్షతో జనసేన, బీజేపీలతో కూటమిగా ఏర్పడ్డారు. కారణాలేమైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. డాక్టర్ వైఎస్సార్ పింఛను కానుక పేరును ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంగా మార్చారు. రూ.4 వేలు చొప్పున పింఛను ఇస్తున్నామని చెబుతూనే ఇతర దారుల్లో లబ్ధిదారుల ప్రయోజనాలకు కోత పెట్టే కార్యాచరణకు దిగారు. వైఎస్ జగన్ పాలనలో చివరి నెల 2024 మేలో రాష్ట్ర వ్యాప్తంగా 65,49,864 మందికి పింఛన్లు ఇవ్వగా ఈ నెలలో కూటమి ప్రభుత్వం 63,59,907 మందికి మాత్రమే పింఛను పంపిణీ చేసింది. ఏడు నెలల కూటమి పాలనలో రాష్ట్రంలో 1,89,957 మంది పింఛనర్లను జాబితా నుంచి తొలగించారు.

జగన్ పాలనా కాలంలో...

వైఎస్సార్ సీపీ ఆవిర్భావానికి అప్పట్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాయే వేదికైంది. 2019 మే 30న సీఎం అయిన ఆయన తొలి సంతకాన్ని వైఎస్సార్ పెన్షన్ కానుక అమలుపై చేశారు. ఆరంభంలోనే దివ్యాంగులకు పింఛనును రూ.3 వేలకు పెంచుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు పింఛను ప్రారంభించారు. మిగిలిన వివిధ విభాగాల పింఛన్లను ఐదేళ్లు క్రమంగా పెంచుకుంటూ రూ.3 వేలుకు చేశారు.

దివ్యాంగులపై కనికరం లేని పాలన

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 29,989 మంది, కాకినాడ జిల్లాలో 34,996, తూర్పుగోదావరి జిల్లాలో 32,500 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారు. వీరిలో సుమారుగా జిల్లాకు 500 మంది చొప్పున మంచాన పడినవారు ఉండడంతో రూ.15వేలు పింఛను తీసుకుంటున్నారు. అనర్హులు ఉన్నారన్న సాకుతో మొత్తం దివ్యాంగుల పింఛన్లను సర్వే చేస్తున్నారు. దీంతో దివ్యాంగులు తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నారు. వలంటీర్లను విధులకు దూరం పెట్టడం దివ్యాంగులకు శాపంగా మారింది. తొలిరోజే ఇంటికి పింఛను తెచ్చే పరిస్థితి కనుమరుగైంది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో లబ్ధిదారు వందల కిలో మీటర్ల దూరాన ఉన్నప్పటికీ వలంటీర్ తీసుకువెళ్లి పింఛను అందజేసేవారు. నేడు ఆ మానవత్వం కానరావడంలేదు. కపిలేశ్వరపురం మండలం అంగరలో ఉంటున్న సోదరిని చూసేందుకు వచ్చిన దివ్యాంగురాలు నడవపల్లి భద్రం (54) తిరిగి సొంతూరు యండగండి వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ చక్రాల కిందపడి మృతి చెందింది. ఈనెల ఒకటిన అంగరలో జరిగిన ఈ ఘటన ఈ కూటమి పాలనకు తార్కాణం.

క్లుప్తంగా

బాలిక మృతదేహం లభ్యం



ఝాన్సీ (ఫైల్)

మామిడికుదురు: గోదావరి నదిలో దూకి శనివారం అదృశ్యమైన బి.దొడ్డవరం గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని మట్టపర్తి బేబి అలియాస్ ఝాన్సీ (14) మృతదేహం అప్పనపల్లిలో సోమవారం లభ్యమైంది. ఆమె మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు. గొలుసు విషయమై స్నేహితురాలితో ఏర్పడిన వివాదం నేపథ్యంలో బాలిక తల్లి సత్యనారాయణమ్మ తన కుమార్తెను మందలించడంతో మనస్తాపం చెంది ఈ దారుణానికి ఒడిగట్టిన విషయం తెలిసిందే. బాలిక మృతదేహం లభ్యం కావడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. బాలిక పెదపట్నంలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని. గొలుసు విషయంలో ఏర్పడిన వివాదంపై బాలిక తల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధ్యాపకుడిపై పోక్సో కేసు

- పోలీసుల అదుపులో నిందితుడు
- విద్యార్థినిని నమ్మించి వంచన

కొవ్వూరు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి విద్యార్థినిపై అత్యాచారానికి ఒడిగట్టిన అధ్యాపకుడు వేదాల వినయ్‌వర్ధన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన రాజమహేంద్రవరంలోని ఓ ప్రవేటు కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తుండగా ఆ యువతి సైతం అదే కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. కొవ్వూరు పట్టణానికి చెందిన యువతి గత నెల 28వ తేదీ నుంచి కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు 29న అదృశ్యం కేసు నమోదు చేశారు. ఈ నెల 2వ తేదీ కొవ్వూరుకు తిరిగి వచ్చిన యువతి సదరు అధ్యాపకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి విజయవాడ తీసుకెళ్లి తనను లోబరచుకున్నట్టు పోలీసులకు తెలిపింది.

అక్కడి నుంచి అనంతపురంతో పాటు పలు ప్రాంతాల్లో తిప్పి చివరికి భీమవరంలో విడిచి పెట్టినట్లు యువతి పోలీసులకు వివరించింది. స్థానిక పెద్దలతో కలిసి యువతి కుటుంబ సభ్యులను పోలీసులను సంప్రదించి అదృశ్యంగా నమోదు చేసిన కేసును పోక్సో కేసుగా మార్చినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. మంగళవారం నిందుతుడిని అరెస్ట్ చూపించి కోర్టుకు తరలించనున్నట్టు ఆయన తెలిపారు.

రొయ్యపిల్లల సేకరణ వివాదాన్ని పరిష్కరించండి

- తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల అధికారులకు కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ఎగువ, దిగువ భాగాల్లో రెండు కిలో మీటర్ల రొయ్య పిల్లల విత్తనం సేకరణ లీజు విషయమై నెలకొన్న వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అధికారులతో ఈ విషయమై సమీక్షిస్తూ ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకార సహకార సంఘాల మధ్య నెలకొన్న వివాదాన్ని ఇరు జిల్లాల అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

ఐదేళ్లుగా ఇరు సంఘాలు దీని ద్వారా పొందుతున్న ఆదాయం, ఎంత మంది జీవనోపాధి పొందుతున్నదీ గణాంకాలు రూపొందించి ఆ మేరకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించాలన్నారు. జె ప్రాన్ (రొయ్య పిల్లల) సేకరణ ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద మాత్రమే జరుగుతుందని తెలిపారు. మ్యాపులు రూపకల్పనలో కూడా ఇరు జిల్లాలలో చాలా వ్యత్యాసాలు స్పష్టంగా కనపడుతున్నాయని వీటిని కూడా పునఃపరిశీలించి త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గోదావరి హెడ్ వర్క్స్ కార్య నిర్వాహక ఇంజినీర్, నదీ సంరక్షణ అధికారి ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణారావు, కోనసీమ జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు సహాయ సంచాలకులు కె.ప్రభాకర్ మత్స్యకార సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోంది



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

- కిర్లంపూడిలో వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం
- మాజీ మంత్రి ముద్రగడకు సంఘీభావం

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిరిబాబు, జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంఘీభావం తెలిపారు. సోమవారం కిర్లంపూడిలోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గం ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, రామచంద్రపురం ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్, తుని వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముద్రగడకు సంఘీభావం తెలిపిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా యనమల కృష్ణుడు మాట్లాడుతూ రాజకీయంలో మహాశక్తిలాంటి నాయకుడైన ముద్రగడ నివాసంపై దాడి జరిగిందంటే కూటమి ప్రభుత్వం లా అండ్ ఆర్డర్ పరిస్థితి ఎలా ఉందో అర్ధమౌవుతుందని అన్నారు. పిల్లి సూర్యప్రకాశ్ మాట్లాడుతూ అజాత శత్రువుగా పేరొందిన ముద్రగడపై దాడులు హేయం అన్నారు. కూటమి ప్రభుత్వం లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. పిఠాపురం సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ తాను లా అండ్ ఆర్డర్ చేతిలోకి తీసుకుంటే మరోలా ఉంటుందని చెప్పడం కాదని, ఈ రోజు ఆ పార్టీ కార్యకర్త చేసిన దాడిపై సమాధానం చెప్పాలన్నారు. దొరబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అరాచక సంస్కృతిని మానుకోవాలని హెచ్చరించారు.

ప్రాణం తీసిన పొగమంచు



హరిశ్చంద్ర ప్రసాద్‌ను ఢీకొన్న వ్యాను



ఘటన స్థలంలో పడి ఉన్న మృతదేహం

- ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో టాటా ఏస్‌ను ఢీకొని ఘటన
- పడిపోయిన యువకుడి పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో దుర్మరణం



బాబు (ఫైల్)

నల్లజర్ల: పోతవరం శివారులో సోమవారం ఉదయం 6.30 సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు అందించిన వివరాల మేరకు పోతవరం పాతపేటకు చెందిన తానేటి హరిశ్చంద్రప్రసాద్ (బాబు) (24) జంగారెడ్డిగూడెంలో ఓ సెల్ షాపులో ఉంటూ నిత్యం ఒకొక్క గ్రామంలో సిమ్‌లు విక్రయిస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం దట్టంగా పొగమంచు కమ్ముకున్నప్పటికీ తన బైక్‌పై సిమ్‌ల విక్రయానికి వెళ్లాడు. ఈ క్రమంలో పోతవరం శివారులో ట్రాక్టర్‌ను అధిగమించే ప్రయత్నంలో ఎదురుగా పోగాకు కొట్టు కూలీలను తీసుకువస్తున్న టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టాడు. అద్దాన్ని ఢీకొని కింద పడ్డ అతనిని తప్పించి వెళ్లే చేయబోయిన ట్రాక్టర్ అతనిపై ఎక్కడంతో హరిశ్చంద్రప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. హరిశ్చంద్రప్రసాద్‌కు ఐదు నెలల క్రితమే నబీపేటకు చెందిన చిన్నారితో వివాహమైంది. ఆమె ఇపుడు మూడో నెల గర్భిణి. మృతునికి తండ్రి ప్రసాద్, తల్లి భూలక్ష్మి, సోదరుడు కృష్ణబాబు, సోదరి మమత ఉన్నారు. భార్యతో పాటు కుటుంబ సభ్యులంతా సంఘటనా స్థలంలో విలపిస్తుంటే చూపరుల కళ్లు చెమ్మగిల్లాయి. ఈ విషయం తెలియగానే గ్రామస్తులంతా ఘటన స్థలానికి రావడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు రెండు వాహనాలపై కేసులు నమోదు చేశారు. మృత దేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆదిపూజ్యునికి లక్ష కలార్చన



అయినవిల్లి విఘ్నేశ్వరుని పాదాల చెంత ఉంచిన లక్ష కలాలు



స్వామివారి సన్నిధిలో అక్షరాభ్యాసాల్లో ఓనమాలు దిద్దుతున్న చిన్నారులు

- అయినవిల్లి వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు
- చదువుల పండుగ పేరుతో సరస్వతీయాగం
- 603 మందికి సామూహిక అక్షరాభ్యాసం

అయినవిల్లి: చదువుల పండుగ పేరుతో అయినవిల్లి విఘ్నేశ్వర ఆలయంలో సోమవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీయాగం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో 12 మంది రుత్వికుల పర్యవేక్షణలో జరిగిన పూజల్లో గణపతి పూజ, సరస్వతీ కల్పం, సరస్వతీ మండపారాధన, మహన్యాసం, ఏకాదశ రుద్రాభిషేకం, శాంతి మంత్ర పఠనం, లక్ష గరిక పూజ, లక్ష కలాల పూజ, పుష్పార్చన, సరస్వతీ హోమం మొదలైన పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదంగా లభించిన కలంతో విద్యార్థులు పరీక్షలు రాస్తే శుభ ఫలితాలు సాధిస్తారనే నమ్మకం. ఈ కలాల కోసం విద్యార్థులు భారీగా విఘ్నేశ్వరస్వామిని దర్శించి కలాలను ప్రసాదంగా తీసుకెళ్తారు. 15 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈఓ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

భక్త జనసంద్రంగా..

ఈ సందర్భంగా స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు చేశారు. స్వామివారి ఏకాదశ, లఘున్యాస, రుద్రాభిషేకాలు, వివిధ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా నివేదన అనంతరం వివిధ పుష్పాలతో అర్చకస్వాములు సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 11 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 26 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. 603 మంది చిన్నారులకు నామకరణ, అక్షరాభ్యాసం, తులాభారం వంటివి నిర్వహించారు. 36 మంది తమ నూతన వాహన పూజలు చేయించుకున్నారు. 4850 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.6,13,639 ఆదాయం లభించిందని ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

మామిడాడలో నేడు రథసప్తమి వేడుకలు

పెదపూడి: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామంలో సూర్యనారాయణ మూర్తి జయంతి, రథసప్తమిని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ఆలయ ఉత్సవ కమిటీ, ఈఓ పాటి సత్యనారాయణ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ కొవ్వూరి శ్రీనివాస బాలకృష్ణారెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళాశాసనాలతో ఈ నెల 13వ తేదీ వరకు కల్యాణోత్సవాలు జరగనున్నాయి. 8న స్వామివారి కల్యాణం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించి విద్యుత్ అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి వెంకటనరసింహాచార్యుల అధ్వర్యంలో 10 మంది పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్వామివారి దర్శనానికి భక్తులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేయించి రథంలో ఉంచుతారు. అనంతరం అర్చకుల మంత్రోచ్ఛరణలతో అష్ట దిక్పాలిక బలిహరణ, వసంతంతో కూడిన గుమ్మడిని ప్రదానం చేస్తారు. రథోత్సం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభిస్తారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు, ప్రసాద వినియోగాలు చేస్తారు.



ప్రత్యేక అలంకరణలో దేవేరులతో సూర్యనారాయణమూర్తి

ఫ్లడ్ బ్యాంక్ పనులకు రూ.31.88 కోట్లు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా సిస్టం పరిధిలో ఫ్లడ్ బ్యాంక్‌కు సంబంధించి రూ.31.88 కోట్ల వ్యయంతో వివిధ పనులకు పరిపాలన పరమైన అనుమతులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మొత్తం 7 పనులకు అనుమతులు లభించాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలో ఫ్లడ్ బ్యాంక్ పనుల అభివృద్ధికి సంబంధించి నాగుల్లంక, మానేపల్లి, బాసర్లపూడి పరిధిలో రూ.96 కోట్లతో పనులు, తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం జాలుమూడి గ్రామ పరిధిలో బొబ్బిల్లంకలో రాతి పనులకు 268కోట్లు, పునః నిర్మాణ పనులకు సంబంధించి అంబేడ్కర్ కొనసీమ జిల్లాలో రూ.1340 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో దమ్మయ్యపర్తి మైనర్ డ్రైన్‌పై రూ.774 కోట్లతో ఒక ప్యాకేజీ, రూ.490 కోట్లుతో రెండో ప్యాకేజీ, రూ.139 కోట్లుతో మూడో ప్యాకేజీకి అనుమతులు లభించాయి. సిద్ధాంతం పరిధిలో లక్ష్మీపురం గ్రామంలో లాక్‌గేట్లకు రూ.81.41 కోట్లతో పనులకు ఆమోదం లభించింది.

యువకుడిపై బీరు సీసాతో దాడి

గోకవరం: పాత గొడవల నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య జరిగిన దాడిలో యువకుడిపై మరో యువకుడు, మైనర్‌తో కలిసి బీరు సీసాతో గాయపరిచిన సంఘటన రంపయర్రంపాలెం శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పెంటపల్లి గ్రామానికి చెందిన పల్లె బోయిన దుర్గాప్రసాద్, మరో బాలుడు, తిరుమలాయపాలేనికి చెందిన గట్టుపల్లి వీరవెంకట దుర్గాప్రసాద్ మధ్య ఆదివారం ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న పల్లెబోయిన దుర్గాప్రసాద్, మైనర్ బాలుడు కలిసి బీరు సీసా పగులగొట్టి గట్టుపల్లి వీరవెంకట దుర్గాప్రసాద్ ఛాతిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన యువకుడిని తొలుత గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కొత్తపేట: స్థానిక బోడిపాలెం వంతెన సమీపంలో లారీ ఢీకొని మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో స్థానిక రెడ్డప్ప వారి పేటకు చెందిన పల్లి రమేష్ అతని స్నేహితుడు పల్లి వినోద్ మోటార్ సైకిల్‌పై వెళుతుండగా లారీ ఢీకొనడంతో మోటార్ సైకిల్ వెనుక కూర్చున్న రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుని తండ్రి చిన్న సత్యనారాయణ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు జరుగుతున్నట్టు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో పది మందికి గాయాలు

పెద్దాపురం: మండలంలోని సిరివాడలో పిచ్చికుక్క దాడిలో పది మంది గాయపడ్డారు. ఈ ఘటనలో గ్రామానికి చెందిన నాగులాపల్లి రామారావు, యినకొండ విష్ణుమూర్తి, బి.మణికంఠ, జె.రామారావు, గోపు ఆదిలక్ష్మి, చోడబత్తులు వైష్ణవి, అదే గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చిన మరో నలుగురు గాయపడ్డారు. వారిలో కొందరు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో, మరికొందరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,000 – 14,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

వివాహిత ఆత్మహత్య

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, రాగంపేట మూడు గుళ్ల సమీపంలో ఉంటున్న వి.శిరీష రత్న ప్రశాంతి (30)కి 2016లో ఈశ్వర్ అనే వ్యక్తితో వివాహమైంది.

వీరిది ప్రేమ వివాహం. వ్యక్తిగత కారణాలతో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త గమనించి కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ దంపతులకు 8 ఏళ్ల బాబు ఉన్నాడు. ప్రశాంతి జగన్నాథపురంలోని ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తూ భర్తకు చేదోడుగా ఉండేది. ఈ ఘటనపై కాకినాడ త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.